క్లుప్తంగా

సబ్ స్టేషన్ నిర్మాణ స్థల పరిశీలన



సబ్ స్టేషన్ నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న చందన నాగేశ్వర్

కడియం: స్థానిక పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న స్థలంలో విద్యుత్ సబ్ స్టేషన్‌ను నిర్మించడం ద్వారా మండలంలోని గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు మేలు జరుగుతుందని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ (ఏపీజీబీసీ) చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. ఆ ప్రతిపాదిత స్థలాన్ని శనివారం ఆయన స్థానిక అధికారులతో కలసి పరిశీలించారు. తక్షణం నిర్మాణ పనులు ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాధవీలత దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకువెళ్లానని, సానుకూలంగా స్పందించారని చందన వివరించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.సుజాత, విద్యుత్ శాఖ సిబ్బంది ఉన్నారు.

ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

సీటీఆర్ఐ: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపుతున్న శ్రద్ధ గిరిజనులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వడంపై చూపడం లేదని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభ వివిధ జిల్లాల ప్రతినిధులు మిడియం వెంకటస్వామి, మిడియం వెంకటేష్, మూలెం రాంబాబు, అరగంటి వీరభద్రారెడ్డి, మడ్డిపాటి సతీష్, జక్కల పాండవులు, యలగాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు ఉత్సవం

సీటీఆర్ఐ: స్థానిక గీతాఅప్సర థియేటర్ పక్కన ఉన్న హజరత్ వలి జల్ జలిషా బాబా దర్గా వద్ద ఉరుసు మహోత్సవం శనివారం దర్గా ట్రస్ట్ ప్రెసిడెంట్ జిలానీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఉదయం ఖురాన్ పఠనం, గంధోత్సవం, ప్రార్థనలను సయ్యద్ అబ్దుల్ అన్సారి నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా మాజీ అధ్యక్షుడు అసదుల అహ్మద్ మాట్లాడుతూ 700 ఏళ్ల కిందట ఇక్కడ వేంచేసిన బాబా శాంతి స్థాపనకు కృషి చేశారన్నారు. అనారోగ్యంతో ఉన్నవారిని తన ప్రార్థనలతో స్వస్థి చేకూర్చారన్నారు. రాయల్ మాస్క్ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ కరీం ట్రస్టీలు జలీల్, జాకీర్, అరిఫ్, అర్షద్, ముహీబ్ పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ

సీటీఆర్ఐ: స్థానిక 45వ డివిజన్ రాజీవ్‌గాంధీ నగర్‌లో కొత్త నిర్మించిన ఆలయంలో భవానీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ శనివారం జరిగింది.

వర్మికంపోస్టు తయారీపై దృష్టి పెట్టాలి

కడియం: వర్మికంపోస్టు తయారీపై పంచాయతీ అధికారులు దృష్టి పెట్టాలని డీపీఓ జగదాంబ ఆదేశించారు. వేమగిరిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని, నూతన సచివాలయ భవనాన్ని శనివారం ఆమె పరిశీలించారు.

బంగారు గొలుసు చోరీ

కడియం: బుర్రిలంకలో ఓ మహిళ మెడలో బంగారు గొలుసును దుండగుడు లాక్కుని పరారయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. బుర్రిలంకకు చెందిన రాయుడు త్రివేణి (56) వెలుగుబందలో జరిగిన వివాహానికి మరో నలుగురు మహిళలతో కలసి వెళ్లారు. తిరిగి శనివారం తెల్లవారు జామున 5.30 గంటలకు కారులో ఇక్కడకు చేరుకున్నారు. ఎవరి ఇళ్ల వద్ద వారు దిగిపోగా.. త్రివేణి కూడా కారు దిగి అక్కడికి సమీపంలో ఉన్న తన ఇంటికి నడుచుకుంటూ వెళుతున్నారు. అక్కడి దుర్గమ్మ వారి ఆలయం దగ్గరకు వచ్చేసరికి ఎదురుగా బైక్‌పై హెల్మెట్ ధరించిన అగంతకుడు వచ్చి త్రివేణి మెడలోని ఆరున్నర కాసుల బంగారు గొలుసును లాక్కుపోయాడు. ఈ లోపు అదుపుతప్పి ఆమె కింద పడిపోయింది. పైకి లేచి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు బయటకు వచ్చారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు.

స్పాట్ అసిస్టెంట్ చీఫ్‌గా డాక్టర్ సంజీవరావు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న పరీక్షలు ఒకటి, మూడు, ఐదు సెమిస్టర్ల ప్రశ్నపత్రాల మూల్యాంకనానికి క్యాంప్ ఆఫీసర్, స్పాట్ అసిస్టెంట్ చీఫ్‌గా డాక్టర్ పీవీబీ సంజీవరావును నియమించారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలలో సోమవారం నుంచి ప్రశ్నపత్రాల మూల్యాంకనం ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్ ఎబెల్ రాజబాబు శనివారం తెలిపారు. ఈ బాధ్యతలు తెలుగు శాఖాధిపతి సంజీవరావుకు అప్పగిస్తూ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రమణమూర్తి, కోర్స్ కోఆర్డినేటర్ జి.శరత్‌బాబు అభినందనలు తెలిపారు.

పరిహారం చెల్లించాలి

ప్రకాశంనగర్: విధి నిర్వహణలో తీవ్రంగా గాయపడిన రహదారులు, భవనాల శాఖ సహాయక కార్యనిర్వాహక ఇంజినీర్ కె.నంద కిశోర్‌కు ప్రభుత్వం రూ.50 లక్షల పరిహారం మంజూరు చేయాలని ఉమ్మడి జిల్లా సహాయ కార్యనిర్వాహక సంఘం కన్వీనర్ బి.రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన సమావేశంలో ప్రసాద్ మాట్లాడారు.

గురుకులం పిలుస్తోంది

- ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు
- 24 వరకూ గడువు, వచ్చే నెల 23న ప్రవేశ పరీక్ష



బొమ్మూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల/కళాశాల

రాజమహేంద్రవరం రూరల్: చదువుకుందాం రమ్మని 'గురుకులం' పిలుస్తోంది.. చక్కని విద్య అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.. సీటు సాధిస్తే బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తానంటోంది.. పేద, మధ్య తరగతి వర్గాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల వరంలా మారింది. ఇందులో 2023–24 విద్యా సంవత్సరం ఆంగ్ల మాధ్యమంలో చేరేందుకు సాంఘిక సంక్షేమ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తుకు ఈ నెల 24వ తేదీ తుది గడువు ఇచ్చింది. వచ్చే నెల 23న ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఇందులో ప్రవేశం దక్కితే ఇంటర్ వరకూ ఉచితంగా విద్య అందిస్తుంది. నీట్/ఐఐటీల ప్రవేశాలకు సిలబస్‌తో పాటే శిక్షణ ఇస్తుంది.

ప్రత్యేకతలు ఏంటంటే..

ఈ గురుకుల పాఠశాల, కళాశాలల్లో చదువుతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థినులను తీర్చిదిద్దుతున్నారు. బేసిక్ లెర్నింగ్, డిజిటల్ లెర్నింగ్, స్ట్రెస్ ఫ్రీ లెర్నింగ్ ఉంటుంది. క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఒకేషనల్ విద్యలో భాగంగా క్రాఫ్ట్స్ తయారీలో శిక్షణ అందిస్తున్నారు. ఎంసెట్, నీట్, ఐఐటీలలో సీటు సాధించేలా ప్రత్యేక శిక్షణను ఉపాధ్యాయులు ఇస్తున్నారు. శరీర దారుఢ్యం, మానసిక ప్రశాంతత కోసం యోగా, కరాటేలలో తర్ఫీదు అందిస్తున్నారు. గత ఏడాది సీనియర్ ఇంటర్ విద్యార్థినులు హెచ్‌సీఎల్ కంపెనీలో ఇంటర్న్‌షిప్‌కు అర్హత సాధించారు. ఇంటర్ అనంతరం ఉద్యోగావకాశాలు పొందేలా కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు తదితర వాటిని పెంపొందిస్తున్నారు.



కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

ఐదో తరగతిలో ప్రవేశానికి..

ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు ఐదో తరగతిలో ప్రవేశం పొందాలంటే 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. మిగిలిన వారు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించాలి. 2021–22 విద్యా సంవత్సరంలో 3వ తరగతి, 2022–23లో నాల్గో తరగతి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పూర్తి చేయాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 2022–23 నాటికి రూ.లక్ష మించి ఉండరాదు. రిజర్వేషన్లు ఎస్సీలకు 60 శాతం, బీసీ–సీ 10 శాతం, ఎస్టీలకు ఐదు శాతం, బీసీ–4 శాతం, ఓసీ–1 శాతం ఉంటుంది.

ఇంటర్ ప్రవేశానికి అర్హతలు

2022–23లో పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థినులు మాత్రమే అర్హులు. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్‌లో చదివిన వారికి ఏడాది మినహాయింపు ఉంటుంది. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు మాత్రమే ఉండాలి. ఎస్సీలకు 75 శాతం, బీసీ–సీ 12 శాతం, ఎస్టీలకు ఆరు శాతం, బీసీలకు ఐదు శాతం, ఓసీలకు రెండు శాతం రిజర్వేషన్లు అమలు చేస్తారు. ప్రవేశ పరీక్షకు గణితంలో 25 ప్రశ్నలు, ఫిజికల్ సైన్స్‌లో 15, బయోలజీలో 15, సోషల్‌లో 15, ఇంగ్లిషులో 15, లాజికల్ రీజనింగ్‌లో 15 ప్రశ్నలు ఉంటాయి.

దరఖాస్తు చేసుకునే విధానం

http:r//apcet.apcfrr.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. దరఖాస్తులో ఐదో తరగతిలో చేరే పాఠశాల, కళాశాల వివరాలు నమోదు చేయాలి. ఆన్‌లైన్‌లో నమోదు చేశాక పాఠశాలలు/ కళాశాలల మార్పు కుదరదు. ప్రవేశ పరీక్షలో వచ్చే మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ, సీట్ల కేటాయింపు ఉంటుంది. ఇతర వివరాలకు 97017 33321 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

సందేహాలు ఉంటే సంప్రదించండి



గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. దరఖాస్తు గడువు ఈ నెల 24 వరకూ ఉంది. పేద, మధ్యతరగతి వారికి ఇదో సదావకాశం. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి. సందేహాలుంటే సంబంధిత గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలి.

– ఎ.మురళీకృష్ణ, జిల్లా కోఆర్డినేటర్

పేదలకు ఇది వరం



చదువుపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఇదో మంచి అవకాశం. ఐదో తరగతిలో చేరితే ఇంటర్ వరకూ చదువు, వసతి, అవసరమైన సదుపాయాలు ఉచితంగా కల్పిస్తారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన ఉంటుంది. ఉన్నత కోర్సుల్లో చేరేందుకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ఎ.వాణికుమారి, ప్రిన్సిపాల్, గురుకుల బాలికల పాఠశాల/కళాశాల, బొమ్మూరు

మోటారు వాహనాల చట్టంపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తులు రాజగోపాల్, ప్రత్యూషకుమారి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మోటార్ వాహనాల సవరణ చట్టంపై శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. స్థానిక జిల్లా న్యాయ సేవాధికార కార్యాలయంలో జరిగిన ఈ సదస్సులో అదనపు జిల్లా న్యాయమూర్తి సీహెచ్ రాజగోపాల్ మాట్లాడారు. మోటార్ వాహనాల సవరణ చట్టం 2019లో పలు సెక్షన్లపై ఆయన అవగాహన కల్పించారు. చట్టంలోని 11, 12 అధ్యాయాల సారాంశాన్ని వివరంగా తెలియజేశారు. ఈ సవరణలకు అనుగుణంగా న్యాయ వ్యవస్థ, పోలీసు, బీమా సంస్థలు పాటించాల్సిన నిబంధనలను వివరించారు. యాక్సిడెంట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్, ఇతర సంబంధిత ప్రక్రియల్లో ఆలస్యం ఉండరాదన్నారు. మోటార్ వాహనాల సవరణ చట్టాలు, నిబంధనలకు సంబంధించి సుప్రీం కోర్టు సూచనలను భాగస్వాములంతా తప్పనిసరిగా పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసు అధికారులు, వివిధ బీమా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

కడియం: వాషీ సంస్థ సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. శనివారం స్థానిక హైస్కూల్‌లో హెచ్‌డీబీఎఫ్ఎస్, వాషీ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో స్టేక్ హోల్డర్స్ సమావేశం హెచ్‌ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వీర్రాజు మాట్లాడుతూ సంస్థ ప్రభుత్వ పాఠశాలలకు మరుగుదొడ్లు, హ్యాండ్ వాష్, ప్రహారీల నిర్మాణం వంటి పనులు చేయడం ప్రశంసనీయమన్నారు. ఎంఈఓ వి.లజపతిరాయ్, స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. ప్రాజెక్టు అధికారి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పలు పనులు చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా కడియం, అనపర్తి, రాజానగరం మండలాల్లో సుమారు కూ.2.5 కోట్ల విలువైన పనులను ప్రజల భాగస్వామ్యంతో చేపట్టామన్నారు. సంస్థ ఉద్యోగులు డి.శ్రీనివాసరావు, ఎం.మౌనిక, జె.మదర్‌థెరిసా, ఉపాధ్యాయులు కె.రాజు, కె.శ్రీనివాస్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



వాషీ సంస్థ సభ్యులు, తదితరులతో గిరజాల వీర్రాజు

భూసార పరీక్ష కేంద్రం తనిఖీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక మార్కెట్ కమిటీలోని భూసార పరీక్ష కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు శనివారం తనిఖీ చేశారు. భూసార పరీక్షలకు అవసరమయ్యే పరికరాలు తక్షణం సిద్ధం చేసుకోవాలని, పనిచేయని పరికరాలకు వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం రాజమహేంద్రవరం కేంద్రంగా భూసార పరీక్ష కేంద్రం ఒకటి మాత్రమే అందుబాటులో ఉందన్నారు. రబీ వరి కోతల అనంతరం రైతుల నుంచి మట్టి సేకరించి భూసార పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వ్యవసాయాధికారులు సరళ, భీమరాజు, ఏఈవోలు వేణుమాధవ్, ఎస్వీ శ్రీనివాస్, పీటర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఓనువులమ్మ విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తులు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలో అత్యంత సుందరంగా నిర్మించిన ఓనువులమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠ శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 10.18 గంటలకు వేదపండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల జయజయ ధ్వానాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. తొర్రేడు గ్రామస్తులే కాకుండా వెంకటనగరం, కాతేరు, మిర్తిపాడు, ఉండేశ్వరపురం, బొబ్బిల్లంక, ములకల్లంక, కాటవరం తదితర గ్రామస్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేద పండితులు సి.సత్యనారాయణ శాస్త్రి శిష్య బృందం ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం, యంత్ర స్థాపన, పూర్ణాహుతి జరిగింది. శ్రీబాలాజీ లేవుట్‌లో అన్న సమారాధన నిర్వహించారు. ఉదయం మొదలైన అన్న సమారాధన సాయంత్రం వరకు కొనసాగింది.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- ప్రభుత్వంపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి
- గృహ సారథులతో ఎంపీ భరత్‌రామ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: సీఎం జగన్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. శనివారం స్థానిక ఉమా మార్కండేశ్వర స్వామి ఆలయ సమీపంలోని చందా సత్రంలో నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి అధ్యక్షతన గృహ సారథుల సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ టీడీపీ హయాంలో ప్రజలు పడిన అవస్థలు అన్నీ ఇన్నీ కావన్నారు. పింఛన్లు, రేషన్ కార్డులు రావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం ఉండేది కాదన్నారు. లంచాలిస్తేనే పథకాలు అందేవన్నారు. ఇప్పుడు జగన్ పాలనలో పారదర్శక పాలన అందుతోందన్నారు. లబ్ధిదారులందరికీ పథకాలు దరిచేరాయన్నారు. సీఎం జగన్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి ప్రతిపక్ష టీడీపీ లేనిపోని బురద జల్లుతుందని, దీనిని సమర్థవంతంగా తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త, నాయకుడిపై ఉందన్నారు. గ్యాస్, పెట్రోలు ధరలు పెరగడానికీ రాష్ట్ర ప్రభుత్వానికీ ఏవిధమైన సంబంధం లేదన్న విషయం ప్రజలకు వివరించాలన్నారు. వైఎస్సార్ సీపీ అంటే పేదల పార్టీ అని అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకూ నగరాన్ని ఏ విధంగా అభివృద్ధి చేశానో చూడాలన్నారు. రాష్ట్రంలో రాజమహేంద్రవరాన్ని ఒక అద్భుత హరిత నగరంగా, హెరిటేజ్ నగరంగా తీర్చిదిద్దుతానన్నారు. ఇంటింటికీ పార్టీ శ్రేణులు, గృహ సారథులు వెళ్లినప్పుడు లేనిది చెప్పవద్దు.. చేసిందే చెప్పండని ఎంపీ భరత్ సూచించారు. పేదలందరికీ ఇళ్ల పట్టాలు, ఇళ్లు ఇప్పించే బాధ్యత తనదేనని చెప్పారు. గృహసారథులు ప్రజా విశ్వాసాన్ని, అభిమానాన్ని పొందేలా వ్యవహరించి పార్టీకి, సీఎం జగనన్నకూ మంచి పేరు తీసుకురావాలని సూచించారు. క్లస్టర్ ఇన్‌చార్జి కొత్తా విజయరాజ్యలక్ష్మి, ఆయా వార్డుల ఇన్‌చార్జులు దుర్వాసుల సత్యనారాయణ, వాకచర్ల కృష్ణ, అరవా సురేష్, అడపా రఘు, కాటం రజనీకాంత్, పాల్గొన్నారు.

సమతుల ఆహారంలో చిరుధాన్యాలు

సీటీఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సమతుల ఆహారంలో చిరు ధాన్యాలను చేర్చడంతో పాటు శ్రీఅన్న పేరుతో గౌరవించడం ఆనందదాయకమని సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. శనివారం స్థానిక కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ (సీటీఆర్ఐ), కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సంయుక్తంగా ప్రకృతి వ్యవసాయం– చిరుధాన్యాల సాగు అనే అంశంపై సీటీఆర్ఐ సెమినార్ హాల్లో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరం 2023 సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచ చిరు ధాన్యాల సదస్సు (శ్రీఅన్న) న్యూఢిల్లీలో ప్రారంభించిన కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా ప్రకృతి విధానంలో చిరు ధాన్యాల సాగు చేపట్టిన రైతులు, రైతు మహిళలు, ఇతరులు వర్చువల్ విధానంలో వీక్షించారు. దీనికి అధ్యక్షత వహించిన డాక్టర్ ఎం.శేషుమాధవ్ మాట్లాడుతూ తక్కువ నీటి వసతితో చిరు ధాన్యాలను సాగు చేయడం, అధిక దిగుబడులనిచ్చే రకాలను ఎంచుకోవడం, ప్రోసెసింగ్ యూనిట్లను స్థాపించుకోవడం, ఉత్పత్తులకు విదేశీ ఎగుమతుల పథకాలు, బ్రాండింగ్, స్టోరేజీ సౌకర్యాలు తదితర అంశాలపై కేవీకే, కేవీకే ద్వారా స్థాపించిన రైతు ఉత్పత్తి దారుల సంఘాలు ప్రణాళికలు చేపట్టాలని సూచించారు. వాతావరణ సంసిద్ధత, సాంకేతికత, బయోఫోర్టిఫైడ్ చిరు ధాన్యాల వినియోగంపై అవగాహన కల్పించాలని కోరారు. కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ ప్రధాని మోదీ వ్యక్తపరిచిన అంశాలను రైతులు, రైతు మహిళలకు వివరిస్తూ ప్రపంచ చిరుధాన్యాల సాగులో భారతదేశం పాత్ర 5 నుంచి 6 శాతం మేరకు ఉందన్నారు. భవిష్యత్తులో చిరుధాన్యాల విస్తీర్ణం పెరగాలని ఆశించారు. పెద్దాపురం వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ వి.సుజాత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చిరుధాన్యాల సాగు పద్ధతులు, ఆహారంలో వాటి పాత్రపై వివరించారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.తాతారావు మాట్లాడుతూ ప్రకృతి విధానంలో చిరు ధాన్యాలను చాలా సునాయాసంగా, అతి తక్కువ సస్యరక్షణ చర్యలతో సాగు చేయవచ్చన్నారు. ఏపీసీఎన్ఎఫ్ ఏపీడీఎం ఎండీ వలీ, కేవీకే ఉద్యాన పంటల అధికారి జేవీఆర్ సత్యవాణి, కేవీకే వాతావరణ స్పెషలిస్టు కె.దిలీప్, ఏపీసీఎన్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు రాక



రైల్వే స్టేషన్‌లో భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు

రాజమహేంద్రవరం సిటీ: తెలుగు రాష్ట్రాల మీదుగా తొలిసారిగా పుణ్యక్షేత్రాల దర్శనానికి బయలు దేరిన భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు శనివారం రాత్రి రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. పూరి, కోణార్క్, కాశీ, అయోధ్య తదితర పుణ్యక్షేత్రాల దర్శనానికి బయలు దేరిన ఈ రైలుకు రాజమహేంద్రవరంలో రైల్వే అధికారులు స్వాగతం పలికారు. ఈ యాత్ర 9 రోజులు 8 రాత్రులుగా సాగుతుందని అధికారులు వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 700 మంది ఈ రైలులో పయనమయ్యారన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు

కంబాలచెరువు: విద్యాహక్కు చట్ట ప్రకారం పేద విద్యార్థులకు ప్రభుత్వం ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత ప్రవేశాలు కల్పిస్తోందని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకూ తల్లిదండ్రులు తమ పిల్లలకు సీట్ కావాల్సిన స్కూళ్లలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మొదట విడతలో ఎంపికైన వారికి వచ్చే నెల 19 నుంచి 25 వరకూ ప్రవేశాలు కల్పిస్తారన్నారు.

ప్రవీణ్‌కుమార్‌కు అభినందన

రాజమహేంద్రవరం రూరల్: ఇటీవల సూరత్‌లో ఇండియా, బంగ్లాదేశ్ జట్ల మధ్య జరిగిన వీల్ చైర్ క్రికెట్ టోర్నమెంట్‌కు దేశం తరఫున ఆడిన ధవళేశ్వరం గ్రామానికి చెందిన, కాతేరు పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ మానుపాటి ప్రవీణ్‌కుమార్‌ను ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అభినందించారు. శనివారం చందన నాగేశ్వర్‌ను ప్రవీణ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చందన మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించి కీర్తి ప్రతిష్టలు పెంచేలా ప్రవీణ్‌కుమార్ కృషి చేశారన్నారు. రాబోయే రోజులలో మరింత రాణించి మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మదర్‌థెరిసా సొసైటీ సభ్యులు ఏపీజీ అండ్ బీసీ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా పూల బొకే, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో కె.రత్నకుమారి, పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు, మదర్‌థెరిసా సొసైటీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, బాషా, పుష్కర్, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



చందన నాగేశ్వర్‌ను సత్కరిస్తున్న ప్రవీణ్‌కుమార్, మల్లేశ్వరరావు తదితరులు

ఆకట్టుకున్న ప్రాజెక్ట్ ఎక్స్‌పో



డైట్‌లో ప్రాజెక్ట్ ఎక్స్‌పోను తిలకిస్తున్న విద్యాశాఖాధికారులు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం, ప్రథమ్ సంస్థ సంయుక్తంగా 9వ తరగతి విద్యార్థులకు ఈఎండీపీ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని జిల్లా సైన్స్ అధికారి జీవీ శ్రీనివాస్ నెహ్రూ తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రతి శుక్రవారం ప్రత్యేక తరగతుల ద్వారా బడ్జెట్ పొదుపు, ఖర్చు తదితర అంశాలపై వివరిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల స్థాయిలో నిర్వహించిన కార్యక్రమాల ద్వారా మండల స్థాయికి, తదుపరి జిల్లా స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులపై శనివారం బొమ్మూరులో డైట్‌లో ప్రాజెక్ట్ ఎక్స్‌పోను ప్రదర్శించారు ఇందులో ధవళేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రాజెక్ట్, కడియం మండల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయని నెహ్రూ తెలిపారు. ఈ నెలాఖరున జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. ఈఎండీపీ జిల్లా మేనేజర్ ఉదయ్ కుమార్, డైట్ ప్రిన్సిపాల్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్షాభియాన్ ఏఎం ఒ.గౌరీశంకర్, సీఎంఓ శ్రీనివాస్, ఎంఐఎస్– ప్లానింగ్ కోఆర్డినేటర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



బొమ్మూరులో వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వెంకటేశ్వరనగర్‌లో భూ సమేత వేంకటేశ్వరస్వామివారి 11వ ఏకాదశ వార్షిక కల్యాణోత్సవం శనివారం గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు గొందేశి శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షణలో వైభవంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు, సుదర్శన హోమం, మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం టీటీడీ ఆగమన సలహాదారుడు ఖండవిల్లి రాధాకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి గాయత్రి నృత్యనికేతన్ ఆధ్వర్యంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కలెక్టర్‌ను కలసిన ఏపీ జేఏసీ సభ్యులు



కలెక్టర్ మాధవీలతతో మాట్లాడుతున్న జేఏసీ సభ్యులు

సీటీఆర్ఐ: ఏపీ జేఏసీ అమరావతి కార్యవర్గ సభ్యులు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పర్యటించారు. ఇందులో భాగంగా శనివారం ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర జనరల్ సెక్రటరీ చేబ్రోలు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వారు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలతను మర్యాద పూర్వకంగా కలిశారు.